# సాక్ష్యం

**పట్టపగలు దారుణంగా హత్య జరిగింది.**

నగరాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని, దేశాన్ని ఆ కేసు ఊపేస్తోంది.

పత్రికల్లో హత్యను గురించిన ఎన్నో కథలు వచ్చాయి. కోర్టులో వాదప్రతివాదాలొచ్చాయి.

ఆ కేసుకు అంత పేరు రావడానికి కారణం

చంపబడ్డ వ్యక్తి నగరంలో పేరుమోసిన లాయర్ రామనాథం. చంపినవాడు రౌడీ పర్వతాలు.

రామనాథానికి పర్వతాలుకు కోర్టు చుట్టరికం చాలా ఏళ్ళుగా వుంది. చాలా కేసుల్లో రామనాథం పర్వతాలుకు వ్యతిరేకంగా వాదించి శిక్షలు వేయించాడు.

కానీ ఈ సారి రౌడీ పర్వతాలు ఒక పెద్ద నేరం చేసి నేరుగా రామనాథం దగ్గరికే వచ్చాడు. చేసిన నేరాన్ని పూసగుచ్చినట్టు చెప్పాడు. ఆ నేరాన్ని ఎందుకు చేయాల్సివచ్చిందో ఆ పూర్వాపరాలు వివరించి చెప్పాడు.

“ఈసారి నాకు శిక్షపడడానికి వీల్లేదు. ఎందుకంటే నేను ఎలాంటి నేరాలు చేయకుండా వుండాలని నిర్ణయించుకున్నాను. నా పెళ్ళాంబిడ్డల మీద ప్రమాణం చేసాను. అందుకే ఈ సారి మీరు నా పక్షాన వాదించాలి. మీరు వాదిస్తే నేనే స్వయంగా నేరం చేసానని చెప్పినా నా మాట ఎవరూ నమ్మరు. నేరం చేయలేదన్న మీ మాటనే నమ్మి శిక్ష వేయకుండా వదిలేస్తారు.

“ఫీజ్ తెచ్చావా? ముందా బల్లమీద పెట్టు”

'తెచ్చాను కానీ, అది బల్లమీద పెట్టేది కాదు. మీకు నేను చెప్పేది . మీరు ఈసారి నా పక్షాన వాదిస్తే మీరు ఇప్పటివరకూ చేసిన తప్పులన్నింటినీ క్షమిస్తాను. అది నేను మీకిచ్చే ఫీజు.”

“ఏం తమాషాగా వుందా?'

“అలా అనుకోవద్దు. నేను చాలా సీరియస్‌గా చెప్తున్నాను. నేను రౌడీని. అల్లరి ముండాకొడుకుని. తప్పులే చేసాను. కానీ నేను ప్పులు చేయనప్పుడు కూడా నా మొహాన వున్న క్రిమినల్ ముద్రను ఆధారం చేసుకుని నన్ను నేరస్తుడిని చేసి శిక్షించారు. మరి నా తప్పులకు నాకు శిక్ష పడ్డప్పుడు మీ తప్పులకు మీకు శిక్ష పడక్కర్లేదా? నల్లకోటు చాటున లాపాయింట్లు ముసుగులో ఎంతకాలం తప్పించుకుంటారు? కోర్టులనుంచి తప్పించుకున్నా మనుష్యులం వున్నాంగా? పైన భగవంతుడు వున్నాడుగా?'

'బెదిరిస్తున్నావా?'

'బెదరొద్దు. లాయర్‌ని కాకపోయినా నా వాదనలో సారాన్ని అర్థం చేసుకోండి. ఎందుకంటే మనిద్దరం వొకరికొకరు కావల్సిన వాళ్ళం. వొకరి గుట్టులు మరొకరికి తెల్సినవాళ్ళం. మేము ఇల్లీగల్‌గా తప్పులు చేస్తే మీరు లీగల్‌గా తప్పులు చేస్తున్నారు. మీ లీగల్ తప్పులకి లీగల్‌గా శిక్ష

ఎలాగూ పడదు. కనుక ఇల్లీగల్‌గానే శిక్షించాల్సివస్తుంది.

"నేను నీ పక్షాన వాదించను. కానీ ఇంత దూరం చెప్పావు కనుక ఒక్క సహాయం మాత్రం చేయగలను. ఈ సారికి నీకు వ్యతిరేకంగా వాదించను'.

పర్వతాలు పెద్దగా నవ్వాడు.

'మీ ఇష్టం. కానీ నాకు శిక్ష పడకుండా చేయటం మీ బాధ్యత అని మరవద్దు. నాకు శిక్షపడ్తే మాత్రం మిమ్మల్ని ఇక్కడ ఈ గదిలో మీరా కుర్చీలో కూర్చుని వుండగానే చంపేస్తాను. గుర్తుంచుకోండి.'

అతనలా చెప్తుండగా పక్కనున్న గుమస్తా అంతా విన్నాడు. చూసాడు.

లాయర్ రామనాథం అతని బెదిరింపును పట్టించుకోలేదు.

నేరస్తుల బెదిరింపులకు భయపడ్తే క్రిమినల్ లాయర్ కోర్టుని వదిలేసి చెట్టుకిందకి చేరవచ్చని అతని నమ్మకం.

పర్వతాలుకు శిక్ష పడింది.

☆ ☆ ☆

జైలు శిక్ష పూర్తి చేసుకొని పర్వతాలు రామనాథం ఇంటికొచ్చాడు.

ఆ సమయంలో రామనాథం భవానితో మాట్లాడుతున్నాడు.

భవాని కూడా లాయరే. పక్క జిల్లా హెడ్‌క్వార్టర్స్ నగరంలో ఆమె ఇంటి ముందు ప్లీడరు బోర్డు ఆమె పేరుతో వేలాడుతుంటుంది.

భవాని లీగల్ విషయాలు మాట్లాడడానికి రాలేదు. ఫేమిలీ విషయాలేవో మాట్లాడడానికి వచ్చింది.

రామనాథం భవానీలు లాలో క్లాస్‌మేట్స్. వారి కుటుంబాల మధ్య కూడా పరిచయం వుంది.

భవాని ఎదురుదెబ్బలు తిని తిని విసిగి ప్రాక్టీస్ మానేసి పెళ్ళి చేసుకుంది. అయితే మేరేజ్ లైఫ్‌లో కూడా ఆమె ఎక్కిరాలేదు. ఒక ఆడపిల్ల పుట్టాక భర్త మరణించాడు.

చదువుకునే రోజుల్లో కాలేజీలో ఆమెకి జీనియస్ అని పేరుండేది. అన్నిట్లోనూ ఫస్ట్ మార్కులే.

రామనాథం అందుకు వ్యతిరేకం. అతనిది చిన్నప్పటి నుంచి క్రిమినల్ మైండ్. కాపీలు కొట్టి పరీక్షలు పాసయ్యాడు. నేరాలు చేయడం గురించి ఆలోచించే బుర్ర నేరం చేసిన ఎలా తప్పించుకోవాలో కూడా ఆలోచిస్తుంది. అలాంటి ఉపాయాలు రామనాథం బుర్రలో కోకొల్లలు. దానికి తోడు తెల్సిన కొద్ది నాలెడ్జిని తిరగేసి మడతేసి వాదించి ఇతరుల్ని ఆకట్టుకోటంలో అతను దిట్ట. ఈ లక్షణాలన్నీ అతనికి ప్రొఫెషన్‌లో పైకి రావడానికి ఉపయోగించాయి.

కానీ భవానికి చిన్నప్పటి నుంచి ధర్మం పట్ల అమిత విశ్వాసం.

అవినీతి, అక్రమాలను ఆమె చేయదు. ఇతరులు చేస్తే సహించలేదు. సమాజం ఆరోగ్యకరంగా వుండాలంటే మనము నిర్మించుకున్న చట్టాలని న్యాయసూత్రాల్ని అందరూ శిరసా వహించాల్సిందే. కానీ ఇంగ్లీషు వాడు ఏర్పాటుచేసిన న్యాయశాస్త్రాలకన్నా భారతదేశంలో మహాద్రష్టలైన ప్రాచీన ఋషులు నిర్దేశించిన ధర్మం గొప్పదని ఆమె విశ్వాసం.

ధర్మం నిశ్చలమైనది. న్యాయశాస్త్రాలు అనిశ్చిలమైనవి.

ధర్మానికి కళ్లు, కాళ్ళు, చేతులు సమస్త అవయవాలు వున్నాయి. కానీ న్యాయానికి చెవులు తప్ప కళ్ళులేవు.

"న్యాయవాదిగా పైకొస్తున్నావు. సంతోషమే రామనాథం. కానీ ధర్మాన్ని మర్చిపోకు. ధర్మాన్ని రక్షించడం నీ బాధ్యత అని మర్చిపోకు. ఈ విషయం మర్చిపోతే ధర్మం నిన్ను రక్షించదు. అన్ని రక్షణల్లోకి ధర్మ రక్షణ శ్రేష్టమైనది."

తొలిరోజుల్లోనే రామనాథాన్ని హెచ్చరించింది భవాని.

"ధర్మం ధర్మం! నీకు చిన్నప్పటి నుంచి ఇదే పిచ్చి. నిన్నిప్పుడు ఆ ధర్మం ఏం రక్షిస్తోంది. నాకు ధర్మం అంటే ఏమిటో తెలియదు. అయినా లాయర్‌గా పైకొస్తున్నాను. నా నల్లకోటే నాకు రక్ష దట్సాల్"

ఆ తర్వాత రామనాథం భవానితో మాట్లాడడం మానేసాడు.

పెళ్ళయ్యాక భవాని పక్క జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని అత్తవారింటికి వెళ్ళింది. భర్తపోయాక అక్కడే ప్రాక్టీసు పెట్టింది.

ఇన్నాళ్ళకిన్నాళ్ళకి ఆమె తన కూతురు కోసం అతని దగ్గరకొచ్చింది.

ఎక్కడో యూనివర్శిటీలో చదువుకుంటున్న రామనాథం కొడుకు, భవాని కూతురు ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. అంతటితో ఆగక ఇంకా కొన్ని అడుగులు ముందుకు వేసారు.

"సారీ భవానీ, చదువుకునే రోజుల్లో నువ్వు నాకన్నా చాలా గొప్పదానివి. నిన్ను పెళ్ళి చేసుకోవాలని అప్పట్లో ఎంతో కోరికపడ్డాను కూడా. కానీ నువ్వు నా భావాల్ని గుర్తించలేదు. ఆ తర్వాత జీవితంలో మనిద్దరి దారులు విడిపోయాయి. నేను నా నల్లకోటును నమ్ముకుని పైకొచ్చాను. నువ్వు కనిపించని ధర్మాన్ని నమ్ముకుని ఈ దశకొచ్చావు. అయినా నీ కూతురే ఇలా చేయడం ధర్మంగా కనిపిస్తోందా. పెళ్ళికి ముందే గర్భవతి అయిన నీ కూతుర్ని నా కోడల్ని చేసుకోమనడం నీకు ధర్మం అన్పించిందా? ఏమో నాకు మాత్రం ఇదంతా చాలా ఇల్లీగల్‌గా కన్పిస్తోంది సుమా!"

సరిగ్గా అదే సమయంలో పర్వతాలు అక్కడికొచ్చాడు. రామనాథం మాటల్ని విన్నాడు. బిగ్గరగా నవ్వాడు. చప్పట్లు కొట్టాడు.

రామనాథం ఆ సమయంలో పర్వతాలును చూసి వణికిపోయాడు.

"ఒరేయ్ లుచ్చా. నువ్వు పైకొచ్చింది నీ నల్లకోటును ముసుగుగా కప్పుకునిరా. దాన్ని

నమ్ముకుని కాదు. దయ్యాలు పురాణాలు చెప్పినట్లు గొప్పలు చెప్పుకోకు. నాకు శిక్షపడితే చంపుతానని ఆనాడే చెప్పాను. నువ్వు కేర్ చేయలేదు. న్యాయాన్ని మంచితనాన్ని, మానవత్వాన్ని దేన్నీ కేర్ చేయనివాడివి నువ్వు. నా మాటల్ని కేర్‌చేస్తావుటే. సరే ఇప్పుడు నిన్ను నీ నల్లకోటు రక్షిస్తుందో, న్యాయస్థానాలు రక్షిస్తాయో ఎవరికి మొరపెట్టుకుంటావో పెట్టుకో. నీకు బతకడానికి ఒక్క నిముషం అవకాశం ఇస్తున్నాను." పర్వతాలు కత్తితీసి అతని దగ్గర దాకా వెళ్ళి అన్నాడు.

"పర్వతాలూ, ప్లీజ్. నన్ను చంపకు. నీకు పుణ్యం వుంటుంది. పిల్లలు గలవాడిని. నన్ను కనికరించు."

"ఓరి లుచ్చావెధవ. ఉన్న టైమ్ తక్కువ. ఆఖరి క్షణాల్లోనన్నా భగవంతుడిని తల్చుకో. చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి క్షమించమని ప్రార్థించు."

"ప్లీజ్ భవాని, నువ్వయినా అతనికి చెప్పు. నన్ను రక్షించు. ప్లీజ్."

"మిస్టర్, ఇదేం బాగాలేదు. మనిషిని చంపడం అంత తేలికనుకున్నావా?"

అలా భవాని అంటుండగానే పర్వతాలు కామ్‌గా తన పని పూర్తి చేసేసాడు. రక్తపు బొట్టు చిందకుండా చాలా నేర్పుగా రామనాథాన్ని చంపాడు.

"మనిషిని చంపడం అంత తేలికకాదు సిస్టర్. కానీ రాక్షసుల్ని క్షమించడం రక్షించడం కూడా అంత ఈజీ కాదు. వాడు డబ్బు రాక్షసుడు. వాడిని చంపినందుకు ఎవరూ ఏడవరు. మీరు ఏడవ్వొద్దు."

వెళ్ళబోతూ ఆగాడు.

"మీరు ఎవరో నాకు తెలియదు. కానీ నేను వాడిని చంపడం చూచింది మీరొక్కరే. మీరు ఆ విషయం ఎవరితోనైనా చెప్పండి. నాకేం అభ్యంతరం లేదు. కానీ కోర్టులో నాకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తే మాత్రం ఇదే గతి మీకు పడుతుంది, దట్సాల్."

✡ ✡ ✡

మరో వారం రోజుల్లో తీర్పు ఇవ్వాలి.

కేసును మననం చేసుకుంటున్నాడు జడ్జి ధనుంజయ.

ప్రత్యక్ష సాక్షులు చెప్పింది, పోలీసులు కథనం, లాయర్ ఊహించి కోర్టులో ఎస్టాబ్లిష్ చేసింది... రకరకాల మెటీరియల్ కలపగా ఏర్పడ్డ కథ అది.

పక్కన ఏదో అలికిడి అయినట్లయి ఆలోచనా స్రవంతి తెగింది.

అటుచూస్తే ఎవరో ఫాదర్. ఎప్పుడొచ్చాడో ఏమో కళ్ళు మూసుకుని ఎదురుసీట్లో కూర్చుని వున్నాడు.

ఇటు చూస్తే రైలు ఇంకా ఆగే వుంది. టైమ్ చూసుకున్నాడు. ఆ స్టేషన్‌లో రైలు ఆగి దాదాపు పావుగంట పైనే అయింది. ఏం జరిగిందో ఏమో?

హత్యకేసుకు సంబంధించిన ఆ మెటీరియల్‌తో బుర్ర బరువుగా వుంది.

బరువును వదిలించుకోటానికి మార్గాలు రెండు. ఇంకొకరితో చెప్పుకోడం, తనతో తానే చెప్పుకోటం.

మొదటి అదృష్టం ఎలాగూ లేదు- జడ్జి కనుక.

ప్రయాణంవల్ల రెండో అదృష్టమన్నా వచ్చింది.

అతను మళ్ళీ కథలోకి వెళ్ళాడు.

పోలీసులు రామనాథం హత్యకేసును ప్రిస్టీజ్‌గా తీసుకున్నారు.

ఒక క్రిమినల్ లాయర్‌ను హత్యచేసిన వాడు రేపు పోలీస్ ఆఫీసర్‌నో, ఏకంగా హోంశాఖ మంత్రినో, జడ్జినో హత్య చేయడన్న నమ్మకం ఏముంది?

కష్టపడి కేసును పకడ్‌బందీగా బిల్‌డప్ చేసారు. కానీ ఈ కేసులో ప్రధాన సాక్షి భవానితోనే చిక్కువచ్చి పడింది.

"నేను లాయర్‌ని. మీ కోసం నేను సాక్ష్యం చెప్పను. ధర్మాన్ని రక్షించడానికి సాక్ష్యం చెప్తాను. నా చేత సాక్ష్యం ఏం చెప్పించాలో ఆలోచించకండి. మీ టెక్నిక్కులు నామీద ప్రయోగించకండి. నేను చెప్పవల్సింది కోర్టులో చెప్తాను. ముందుగా ఎవ్వరికి చెప్పను." ఆమె పోలీసులతో, పీపీతో చెప్పింది.

మరో వైపు రామనాథం కొడుకు అమరేంద్ర హంతకుడిని ఎలాగైనా శిక్షింపచేయాలని కంకణం కట్టుకున్నాడు. అతను రామనాథం లాంటి మనిషికాదు. కానీ పట్టుదల ఉన్న మనిషి.

"ఆంటీ, మీ అమ్మాయి నేను ప్రేమించుకున్నాం. చాలాముందుకెళ్ళిపోయాం. మా పెళ్ళి విషయం మాట్లాడడానికి మీరు నాన్న దగ్గరికొచ్చారు. ఆయన మీతో ఏం చెప్పాడో నాకు తెలియదు. కానీ ఇప్పుడు నేను చెప్తున్నాను. మీ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకుంటాను. అందుకుగాను మీరు నాకివ్వాల్సిన కట్నం మీరు చూచింది చూచినట్లు కోర్టులో చెప్పడం. ఈ కోరిక ధర్మవిరుద్ధం కాదనుకుంటాను. ఏం ఆంటీ?"

"కళ్ళతోచూచింది వొక్కటే సత్యం కాదు బాబూ. నేను ఆనాడు విన్నది, చూచింది చాలా వుంది. నేను ధర్మం నిలపడానికే సాక్ష్యం చెప్తానని నీకు మాట ఇస్తున్నాను. చాలా?"

"అమ్మా . నా పెళ్ళి నీ చేతుల్లో వుందమ్మా. ఆ పర్వతాలుగాడికి ఉరిశిక్ష పడితే కానీ అమర్ శాంతించడు. తండ్రిని అంత ఘాతుకంగా చంపినవాడిని ఎవరు క్షమిస్తారమ్మా. అమ్మా, రామనాథం అంకుల్‌ని చంపుతుండగా నువ్వు చూచినట్లు కోర్టులో చెప్పమ్మా, ప్లీజ్" స్వంత కూతురు కోర్టుకెళ్లబోయేముందు ప్రాధేయపడింది.

సాక్ష్యం ఇవ్వటానికి బోనులో నిలబడింది భవాని

చూచింది, విన్నది, అక్షరం పొల్లుపోకుండా అంతా వివరంగా చెప్పింది.

పోలీసులు సంతోషించారు. అమర్ సంతోషించాడు.

పర్వతాలు పక్షాన వాదిస్తున్న డిఫెన్స్ లాయర్ అప్పుడు లేచి ఆమెను ఒకే ఒక ప్రశ్నను అడిగేడు.

"అంతా బాగానే వుంది. కానీ ఒక్క విషయం సూటిగా చెప్పండి. మీరు ముద్దాయి పర్వతాలు లాయర్ రామనాధాన్ని చంపడాన్ని చూచారా?"

"కళ్ళతో చూచానేమో గుర్తులేదు. ఎందుకంటే అప్పుడు నా మనసు కళ్ళతో చూచినదాన్ని స్వీకరించే స్థితిలో లేదు."

"దట్సాల్ యువర్ ఆనర్" అంటూ కూర్చున్నాడు డిఫెన్స్ లాయర్.

" అంటే మీరు లాయర్ రామనాధాన్ని పర్వతాలు చంపడం చూడలేదంటారా?" ప్రాసిక్యూషన్ లాయర్ లేచి ప్రశ్నించాడు.

"అది చెప్పలేను."

"చెప్పలేనంటే ఎలాగండీ? మీరక్కడ ఆ సమయంలో వున్నట్లు అంగీకరిస్తున్నారు. పర్వతాలు ఏం మాట్లాడేడో చెప్పేరు. కన్నుమూసి కన్ను తెరిచేవ్యవధిలో రామనాధం శవమై కుర్చీలో పడివుండడాన్ని చూచామన్నారు. మరి ఆయన్ని చంపడం చూడలేదంటే ఎలాగండీ?'

అప్పుడే జడ్జి కలగచేసుకున్నాడు.

"మిసెస్ భవాని, మీరు లాయర్. ఈ కేసులో మీ సాక్ష్యం ఎంత కీలకమైనదో మీకు తెల్సు. కానీ మీరు హత్య చేయడాన్ని చూచిందీ లేనిదీ నిర్ధారించుకోలేకపోతున్నారు. చెప్పలేమంటున్నారు. ఎందుకని.?"

"ఎందుకంటే నేను మనిషిని. మనసున్న మనిషిని. న్యాయంకన్నా ధర్మానికి విలువనిచ్చే మనిషిని. ఆ రోజు పర్వతాలు మాట్లాడిందాంట్లో నాకు అనేక సత్యాలు కన్పించాయి. ధర్మసూక్ష్మాలు గోచరించాయి. అంచేత నా మనసు ఎక్కడికో వెళ్ళింది. దేన్ని గురించో ఆలోచిస్తోంది."

"దేన్ని గురించి"

"మన దేశంలో న్యాయం ఇంత ప్రగతితో నడుస్తున్న దేమిటా అని? న్యాయవాదులే న్యాయాన్ని అమ్మేస్తున్నారేమా అని? స్వంత బుర్రల్లేని ధర్మాసనాల గతేమిటా అని? న్యాయవాదుల తర్కాలకు వాదనా పటిమకు ధర్మాసనాలు లొంగిపోయే దుర్గతి ఎప్పుడు తొలుగుతుందా అని!"

"అంటే" జడ్జి ధనుంజయ - ఆలోచనల్లో పడ్తూ అన్నాడు.

" ఈ కేసులో ప్రత్యక్షసాక్షిని నేను. అంచేత సా సాక్ష్యానికి కీలక స్థానం వుంది. నేను చంపడం చూచానంటే నిందితుడిని శిక్షిస్తారు. చూడలేదంటే వదిలేస్తారు. అంటే నా వొక్క మాట మీద మీ తీర్పు ఆధారపడి వుందన్నమాట. నా మాటకు అంత విలువ వున్నప్పుడు నేనా మాటను ఎంతకైనా అమ్ముకునే అవకాశం వుంది కదా మైలార్డ్. అటో ఇటో నేను అమ్ముడు పోయి అబద్ధం చెప్పాననుకోండి. అప్పుడు న్యాయం, ధర్మం దగా చేయబడ్డట్లేకదా? లోకంలో ధర్మం చచ్చిపోయినట్లే కదా?"

"కానీ అది లా. లీగల్ కోడ్స్‌లోని ప్రొసీజర్‌నే మనం ఫాలో అవుతున్నాం. తప్పేముంది?'

"ఆలోచించండి మిలార్డ్. తప్పొప్పులు న్యాయాన్యాయాలు ధర్మాధర్మాలు మీరే ఆలోచించండి. సాక్షి మీదనే బరువంతా మోపడం ధర్మాసనానికి మాత్రం భావ్యమా? సాక్షికి కూడా పెళ్ళాం, పిల్లలు వుంటారు కదా? భయాలు, ఆశలు వుంటాయి కదా? అంచేత నా సాక్ష్యం ఆధారంగానే నేను ఏం చూచానన్నది మీరు నిర్ణయించలేరా?"

భవాని న్యాయవ్యవస్థకే సవాలు విసిరింది.

✡ ✡ ✡

రైలు ఒక్క కుదుపుకతో ముందుకు కదిలింది. ఇంజన్ పెద్దగా కూతేసింది.

ఎదురుసీట్లో ఫాదర్ అలాగే కళ్ళు మూసుకుని కూర్చుని వున్నాడు.

ధనుంజయ బెర్త్ పైన కూర్చుని వొక యువకుడెవరో పేకముక్కలతో 'పేషన్స్' ఆట ఆడుకుంటున్నాడు ఒంటరిగా!

ధనుంజయది వస్తుతః గంభీర ప్రవృత్తి.

జడ్జి అయ్యాక గంభీరత మరింత పెరిగింది. ఎక్కడికి వెళ్లడు. వెళ్ళినా మాట్లాడడు. మాట్లాడినా క్లుప్తంగా మాట్లాడతాడు, కానీ అతిగా మాట్లాడడు.

అంచేత అతనంటే న్యాయవాదులకు భయం. లిటగెంట్లకు భయం, కోర్టు స్టాఫుకు భయం.

అతనికి ఇల్లే స్వర్గం. భార్యాపిల్లలే సర్వస్వం. పుస్తకాలే పరమేశ్వర రూపాలు.

చిన్నప్పుడు పేకాట ఆడేవాడు, సిగరెట్లు తాగేవాడు, సినిమాలు విపరీతంగా చూచేవాడు. ఇప్పుడు కూడా ఆ మూడు అంటే అతనికి ఇష్టమే. కానీ వాటికి అతను కావాలనే పరిమితులు విధించుకున్నాడు.

తీర్పు ఇవ్వాల్సిన కేసు బరువు మర్చిపోవటానికి ఇప్పుడు అతను యువకుడు ఆడుతున్న పేషెన్స్ ఆటను చూస్తూ కూర్చున్నాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ మిస్టర్, మీరు తప్పు ఆడుతున్నారు." చూచి ఉండబట్టలేక అతనే యువకుడితో అన్నాడు.

"సారీ సార్, ఆడాలన్న పిచ్చి ఉత్సాహమే కాని నాకు ఆటలో అంత ప్రావీణ్యతలేదు. మీకు పేకాటలో బాగా ప్రవేశం వున్నట్టుంది. సర్దాగా ఇద్దరం ఆడదామా?"

ఆట రెండు రౌండులయ్యింది. రెండుసార్లు ధనుంజయే గెలిచాడు.

"పందెం లేనిదే పేకాట మజాగా వుండదని ఎక్స్‌పర్ట్స్ చెప్పగా విన్నాను సర్. మీరు చూడబోతే ఎక్స్‌పర్ట్‌గా కన్పిస్తున్నారు. డబ్బులు పందెంగా పెడ్తే నేనే నష్టపోతాను. పోనీ ఈ అగ్గిపుల్లల్ని స్టేక్స్‌గా పెట్టుకుందామా?"

అగ్గిపుల్లలన్నీ ధనుంజయ గెల్చుకున్నాడు.

"ఇద్దరమే ఆడుతుంటే బోర్‌గా వుంది కదూ. అయన్ని కూడా ఆడమని అడగితే ఎలా వుంటుందంటారు. యీ కేబిన్‌లో వున్నది మన ముగ్గురమే కదా? ఆ ఫాదర్‌గారు మీకు తెలుసా?"

తెలీదన్నట్లు తలూపాడు ధనుంజయ.

"తెలీకపోతే మాత్రం ఏంలెండి? అడిగితే తప్పు ఏమీ కాదుగా?" అంటూ యువకుడు ఫాదర్‌ని అడిగాడు. "మీరు నాతో ఆడితే ఓడిపోతారు. ఎందుకంటే ప్రభువు నాకు సాయంగా వుంటాడు."

"పేకాటలో కూడానా?" అందామనుకొన్నా అనలేదు ధనుంజయ.

"ఎంత గెల్చుకున్నా అగ్గిపుల్లలే కదా. అవసరమయితే తుంపులు చేద్దాంలెండి.

"నేను అగ్గిపుల్లలతో ఆడను. డబ్బు అయితేనే ఆడతాను. ఏమండీ . ఆ కుర్రాడంటే అనుభవశూన్యుడు. మీరూ అంతేనా? అగ్గిపుల్లలతో పందేలేమిటండీ. మనం ఏమన్నా చిన్నపిల్లలమా? చేవవుంటే డబ్బు పెట్టి ఆడుకోవాలి. లేకపోతే కళ్ళు మూసుకుని ప్రభువును ధ్యానించుకోవాలి. దటీజ్ మై పాలసీ." రెచ్చగొతున్నట్లు ధనుంజయతో అన్నడా ఫాదర్.

"అలాగే కానివ్వండి. డబ్బులు పెట్టే ఆడదాం."

మొదట్లో ధనుంజయే గెల్చుకున్నాడు. కానీ రైలు దిగే సమయానికి ఫాదర్ అతని జేబులో వున్న డబ్బునంతా ఊడ్చేసుకున్నాడు.

✡ ✡ ✡

ఆ రోజు ఒక కేసు విచారణ కొచ్చింది.

తనని పేకాటలోకి దించి ఒక యువకుడు మోసం చేసి మరో వ్యక్తి ద్వారా డబ్బు గెల్చుకున్నాడని కేసు పెట్టాడు ఒక వ్యక్తి.

విచారణకు యవకుడిని ప్రవేశపెట్టారు.

ఆ యువకుడిని చూచి ఆశ్చర్యపోయాడు ధనుంజయ.

ఆ తర్వాత మరో వ్యక్తిని చూచి మరింత ఆశ్యర్యపోయాడు.

వారిద్దరూ ఎవరో కాదు.

రైలు ప్రయాణంలో ధనుంజయను ఆటలోకి దింపి డబ్బు గెల్చుకున్నవారే.

"ఈ వ్యక్తి వొక పెద్ద జూదగాడు. ఈ యువకుడు విద్యార్థి. ఇద్దరూ కలిసి జనాన్ని మాయచేసి పేకాటలోకి దించి డబ్బంతా తోచుకోవడాన్ని వృత్తిలా పెట్టుకున్నారు. ఈ వ్యక్తి పల్లెటూరు రైతులా, పెద్ద జమిందారులా, ఫాదరీగా, పురోహితుడుగా రకరకాల వేషాలు వేస్తాడు."

ప్లీడరు వారికి వ్యతిరేకంగా గట్టిగానే వాదించాడు.

కానీ సాక్ష్యాలను మాత్రం తీసుకురాలేకపోయాడు.

అయితే తనకు తెల్సు - ఆ ఇద్దరూ మోసగాళ్ళని.

తను సాక్ష్యం చెప్తే వారిద్దరికీ శిక్ష పడుతుంది. లేకపోతే కేసు కొట్టేయాల్సివస్తుంది.

తను సాక్ష్యం చెప్పి వారిని దండించడమా, మానటమా అని ఆలోచిస్తుండగా?

భవాని గుర్తుకొచ్చింది.

అతని బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

✡ ✡ ✡

రామనాథం హత్యకేసు ఆ రోజు తీర్పు. కోర్టు కిటకిటలాడుతోంది. పోలీసులు, అమర్ అందరూ పర్వతాలకు శిక్ష పడుతుందన్న ఆనందంతో ధీమాగా వున్నారు. కాకపోతే ఉరిశిక్షా, లేకపోతే యావజ్జీవమా అన్నదే ప్రశ్న.

'ఆంటీ, మీరు డేడీని ఆ వెధవ చంపడం చూచానని చెప్పినట్లయితే మరీ బాగుండేది. వాడికి డెత్ సెన్‌టెన్స్ తప్పకపడేది. అయినా మీరు అన్ని విషయాలు చెప్పారు కదా? కనీసం లైఫ్ సెన్‌టెన్స్ అయినా పడుతుంది. అయ్ విల్ మేరి యువర్ డాటర్.." అమర్ భవానికి అభయం ఇచ్చాడు. నవ్వుకుంది భవాని.

"నాట్ గిల్టీ".

జడ్జిమెంట్ వినగానే అందరికీ తల తిరిగిపోయింది.

"మన న్యాయశాస్త్రాలలో సాక్ష్యానికి మితిమించిన ప్రాధాన్యతవుంది. హత్యకేసుల్లో అయితే సాక్ష్యమే సర్వస్వం,.

అయితే ధర్మశాస్త్రంలో హృదయమే పెద్ద సాక్షి. ఆ దృష్ట్యా ఈ కేసులో ప్రధాన సాక్షి మిసెస్ భవాని సాక్ష్యం చాలా ప్రధానమైనది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, లిటిగెంట్లు, సాక్షులు కూడా చిరకాలం మననం చేసుకోదగ్గది. రామనాధాన్ని పర్వతాలు చంపుతుండగా ఆమె చూడలేదు. మరి దేన్ని చూచింది? హంతకులను చూచింది. ఆ హంతకుల్ని పట్టి శిక్షిస్తే ధర్మం రక్షించబడుతుంది. కానీ ఆ అవకాశం న్యాయశాస్త్రాలలో లేదు. పర్వతాలు రామనాధాన్ని చంపుతుండగా తాము చూచినట్లు ఎవరూ సాక్ష్యం ఇవ్వలేదు కనుక పర్వతాలును నాట్‌గిల్టీ అని రక్షించే అవకాశం మాత్రం న్యాయశాస్త్రంలో వుంది. దాన్ని ఉపయోగించుకునే ఈ తీర్పునిస్తున్నాను.

చాలామందికి ధనుంజయ తీర్పు అర్థం కాలేదు.

"దరమప్రభువా... కలకాలం వర్ధిల్లు నాయనా...' పర్వతాలు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఏడుస్తూ అరిచారు.

'ఆ రామనాధం తన నల్లగౌనులో మనుషుల్ని రాక్షసులుగా, మార్చాడు. మీరు రాక్షసుల్ని సైతం మనుషుల్ని చేయగల తీర్పు నిచ్చారయ్యా. దణ్ణాలు ధర్మప్రభువా...దణ్ణాలు..."పర్వతాలు కోర్టుహాలు దద్దరిల్లేలా అరిచాడు.

"అమ్మా కన్న కూతురినే ఇలా మోసం చేస్తావనుకోలేదు నేను. అమర్ మంచివాడు. కనుక నన్ను పెళ్ళి చేసుకుంటానని ఇప్పటికీ అంటున్నాడు. కానీ నేనుమాత్రం నిన్ను క్షమించనమ్మా. నన్ను మర్చిపో, గుడ్‌బై...'

కూతురు నిర్ణయానికి చలించలేదు భవాని.

నిశ్చలంగా ముందుకు నడవసాగింది.

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 1-11-90